ఎంత వరదొచ్చినా.. ఇక అమరావతి సేఫ్

రెండుదశల్లో వరద మళ్లింపు పథకాలు

- తొలిదశలో రూ. 1,237 కోట్ల వ్యయం
- మొత్తం ఆరు రిజర్వాయర్ల ఏర్పాటు
- వరద జలాలను ఎత్తిపోసేందుకు మూడు లిఫ్టులు
- 2026 చివరి నాటికి తొలిదశ పనులు పూర్తి
- సీఎం చంద్రబాబు మాస్టర్ ప్లాన్

ప్రపంచంలోని ఐదు మేటి నగరాల్లో ఒకటిగా ఉండాలన్న ఆశయంతో పటిష్టమైన పునాదులతో రాజధాని అమరావతి నిర్మితమవుతోంది. అయితే దీనికున్న ఒకే ఒక సమస్య వరద ముంపు.. ఇదే సమస్యను నగరానికి చాలా పెద్ద అనుకూలాంశంగా మార్చుకుంటూ పక్కా ప్రణాళికలతో అమరావతిని మలుస్తున్నారు. సంక్షోభాలను కూడా అనుకూలాంశాలుగా మార్చుకుని ముందుకు సాగడం చంద్రబాబు పద్ధతి. ఇప్పటి వరకు కొందరు ఏదైతే ముప్పని అంటున్నారో అదే సమస్యను రాజధానికి ఓ పెద్ద వరంగా మార్చి చూపేందుకు అద్భుతమైన ప్రణాళికను బ్రహ్మాండంగా ఆయన అమలు చేస్తున్నారు.

నీరుకొండ వద్ద భారీ జలాశయం నిర్మించనున్న ప్రాంతమిదే



(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

అమరావతికి కొండవీటివాగు ముంపు సమస్య చాలా తీవ్రమైంది. దీంతోపాటే పాలవాగు, కొట్టేళ్లవాగు తదితరాలు కూడ. వీటిలో ప్రధానమైన కొండవీటి వాగు పేరేచర్ల కొండలలో పుట్టి 28 కి.మీలు ప్రయాణించి ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా హెడ్ రెగ్యులేటర్ స్లూయాస్‌ల వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. ఈ వాగు పరీవాహక ప్రాంతంలో ఎక్కువ భాగం ప్రస్తుత రాజధాని అమరావతిలోనే ఉంది. భారీ వర్షాల నేపథ్యంలో కొండవీటి వాగు నుంచి వరద నీరు వచ్చి ఎగువ కృష్ణా నదిలో కలుస్తుంది. కృష్ణానదికి వాగుకు మధ్య లాకులు ఉన్నాయి. కొండవీటి వాగు వరద నీరు నదిలోకి వెళ్లేందుకు ఈ లాకులను ఎత్తడంతో నీరు నదిలోకి మళ్లిపోతుంది. కానీ...ఇదే సందర్భంలో కృష్ణానదికి పైనుంచి వరద నీరు మూడు లక్షల క్యూసెక్కులకు మించి వచ్చిందంటే వరదనీరు కొండవీటి వాగులోకి విరుచుకుపడుతుంది. కొండవీటి వాగులో నిత్యం గుర్రపుడెక్కాకు, తూటికాడ ఏపుగా పెరుగుతూ పూడిక వేస్తుంటాయి. దీంతో వాగులో నీరు ముందుకు ప్రవహించడం కష్టసాధ్యమై కట్టలు తెగి సమీప ప్రాంతాలను ముంచెత్తుతుంది. పాలవాగు కూడ కృష్ణాయపాలెం వద్ద ఇతర వాగులతో కలిసి వచ్చి కొండవీటి వాగులో కలుస్తుంది. ఈ సమస్యను

(మిగతా 4లో)



పెనుమాక వద్ద నిర్మించనున్న జలాశయ ప్రాంతమిదే



నెక్కల్లు-పెచ్చుకలపాలెం మధ్య నిర్మిస్తున్న గ్రావిటీ కెనాల్ (రెండోదశ పథకంలోనిది)

నెదర్లాండ్స్ విధానంతో ముందుకు

ప్రధానంగా ఎగువ కృష్ణలోకి వాగు వరద నీటిని లాకుల ద్వారా తరలించడమన్నది అసాధ్యమన్న సంగతిని సీఎం చంద్రబాబు గుర్తించారు. అందుకే ఈ సమస్యను గురించి నిపుణులతో సమగ్రంగా అధ్యయనం చేయించి దీనికి నెదర్లాండ్స్ విధానాలే అసలైన పరిష్కార మార్గాలుగా తేల్చేశారు. ప్రస్తుతం చిందరవందరగా ఉన్న వాగులు వంకలను ఓ క్రమపద్ధతిలో ప్రవహించేలా చేసి కొత్త ప్రవాహ రూపాలనిస్తూ వాటిని మధ్యమధ్యలో బ్యాలెన్స్‌డ్ రిజర్వాయర్లతో అనుసంధానించేలా నెదర్లాండ్స్ విధానాన్ని అమలు చేస్తున్నారు. రాజధాని అమరావతి నీటి అవసరాలు తీరేలా వరద జలాలను వృథా పోనివ్వకుండా వాటన్నింటిని రిజర్వాయర్ల రూపంలో నిల్వచేసి భూగర్భ జలాలు పెరిగేలా.. రిజర్వాయర్లను ఒకదానితో ఇంకోటి అనుసంధానిస్తూ ఓవర్‌ఫ్లో అయ్యే నీటిని తరలించేలా ప్రణాళికలను రూపొందించారు. కాలువలను సుందరీకరించి వాటి తీరాలలో పార్కులు, రిసార్టులు వంటి వాటిని ఏర్పాటుచేయడం, కాలువల్లో నావిగేషన్ సౌకర్యాలను కల్పించడం వంటి చర్యలతో పర్యాటకాభివృద్ధి జరిగి వాటి నిర్వహణకయ్యే ఖర్చులను సునాయాసంగా రాబట్టేలా పథకం వేశారు.

అనుసంధానంగా హైవేలు

నిజాంపట్నం పోర్టు కనెక్టివిటీకి గ్రీన్‌ఫీల్డ్ హైవే

- రూ.1400 కోట్ల అంచనాతో ఎలైన్‌మెంట్ సిద్ధం
- కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదన
- వినుకొండ-గుంటూరు, తెనాలి-చినకాకాని, నారాకోడూరు-ఎన్‌హెచ్-16లకూ..

గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని జిల్లా కేంద్రమైన గుంటూరుతో, నిజాంపట్నం పోర్టుతో మరిన్ని ప్రాంతాలు అనుసంధానమయ్యేలా.. వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి వచ్చేలా.. ఎగుమతులు, దిగుమతులుకు మార్గం సుగమం చేసేలా హైవేలకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ప్రతిపాదనలను రూపొందించింది. ఈ క్రమంలో నిజాంపట్నం పోర్టుని జాతీయ రహదారులతో అనుసంధానం చేసే ప్రాజెక్టును కేంద్రానికి ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించింది. నారాకోడూరు నుంచి నిజాంపట్నం వరకు నిర్మించే నాలుగు వరసల గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎలైన్‌మెంట్ రూపకల్పన జరిగింది. అయితే కేంద్రం ఆమోదించిన తర్వాతనే దానిని పోర్టల్‌లో అప్‌లోడింగ్ చేసి భూసేకరణ ప్రక్రియని ప్రారంభిస్తామని ఎన్‌హెచ్ అధికారులు తెలిపారు. దీనివల్ల నిజాంపట్నం పోర్టుకు ఎగుమతులు, అక్కడికి



దిగుమతులు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ప్రతిపాదిత పోర్టు కనెక్టివిటీ ప్రాజెక్టు అమరావతి రాజధాని ఔటర్ రింగురోడ్డుతో పాటు ఎన్‌హెచ్-16కి కూడా లింకవుతుంది. పోర్టుల అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిజాంపట్నం పోర్టుని కూడా అభివృద్ధి చేస్తోన్న విషయం తెలిసిందే. అయితే ఈ పోర్టుకు ఇప్పటి వరకు సరైన కనెక్టివిటీ లేదు. వాన్‌పిక్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చి ఉంటే నిజాంపట్నం పోర్టుకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరేది. అయితే ఆ ప్రాజెక్టు సీబీఐ కేసులతో అటకెక్కింది. ఈ నేపథ్యంలో నిజాంపట్నం పోర్టుకు సరైన రోడ్డు కనెక్టివిటీని కల్పించడం ద్వారా మత్స్య ఉత్పత్తుల ఎగుమ తులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా జాతీయ రహదారులను అనుసందానిస్తూ రహదారి నిర్మాణం చేపట్టాలని ఎన్‌హెచ్‌ఏఐని కోరింది. ఆ మేరకు రూ.1400 కోట్ల అంచనాతో ఆ సంస్థ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. దీనికి కేంద్రం ఆమోదిస్తే ఎన్‌హెచ్ నంబరు వస్తుంది. ఆ తర్వాత భూసేకరణ, నిర్మాణ ప్రక్రియ ప్రారంభమౌతుంది.

మరో రెండు ప్రాజెక్టులూ..

మరో రెండు ప్రాజెక్టులను కూడా ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించింది. అందులో ఒకటి చినకాకాని జంక్షన్ నుంచి తెనాలి వరకు ఆరు వరసల జాతీయ రహదారి. దీని పొడవు 17.4 కిలోమీటర్ల వరకు ఉంటుంది. మరొకటి నారాకోడూరు- ఎన్‌హెచ్ 16 సెక్షన్. ఇది ఐదు కిలో మీటర్ల దూరం పైగా ఉంటుందని ఎన్‌హెచ్ అధికారులు తెలిపారు. అలానే వినుకొండ - గుంటూరు జాతీయ రహదారిని నాలుగు వరసలుగా అభివృద్ధి చేసే ప్రాజెక్టుని కూడా ప్రతి పాదించినట్లు పేర్కొన్నారు. దీనికి పరిపాలన అనుమతి రావాల్సి ఉందన్నారు. కేంద్రం నుంచి అనుమతులు రాగానే అన్ని రోడ్డు ప్రాజెక్టుల నిర్మాణం చేపడతామని అధికారులు తెలిపారు.



పరీక్షా కేంద్రంలో ఎస్పీ వకుల్ జిందాల్

ప్రశాంతంగా ఏపీపీ రాత పరీక్షలు

గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పటిష్ఠ బందోబస్తు మధ్య ఆదివారం గుంటూరులో ఏపీపీ రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పలకలూరురోడ్డులోని విజ్ఞాన్ కళాశాలలో పరీక్ష నిర్వహించారు. కాగా పరీక్షకు హాజరైన అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రంలోకి అనుమతించారు. పరీక్షలను ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.రాధిక, పరీక్ష నోడల్ అధికారి ఏఎస్పీ రమణమూర్తిలతో ఎస్పీ మాట్లాడి పరీక్షల నిర్వహణ విధానాన్ని తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు సౌత్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్, ఎస్ఐ వాసు, తదితరులు పర్యవేక్షించారు.

పగలు భగభగ.. సాయంత్రం కుండపోత

నగరంలో తటాకాలుగా మారిన ప్రధాన రోడ్లు

గుంటూరు, గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గత వారం నుంచి వర్షాలు ఆగిపోయి.. ఎండలు భగ్గుమంటూ మండిపోయాయి. ఆదివారం కూడా సాయంత్రం వరకు ఎండ మండిపోయింది. కాగా 4.30 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కుంభవృష్టిలా కురిసింది. విడతలు విడతలుగా రాత్రి 7.30 గంటల వరకు కురుస్తూనే ఉన్నది. దీంతో ఎప్పటిలానే నగరంలోని డ్రెయిన్లన్నీ రోడ్లపైకి ఉప్పొంగాయి. డొంకరోడ్డు, కంకరగుంట అండర్‌పాస్‌లోకి వర్షం నీరు చేరింది. దీంతో ఆయా మార్గాల్లో రెండు, మూడు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లు తటాకాల్లా మారడంతో రింగురోడ్డు, స్తంభాలగరువు, బ్రాడీపేట, అరండల్‌పేట లక్ష్మీపురం, జీఎస్‌టీ రోడ్డులో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



బ్రాడీపేట 1/17 అడ్డరోడ్డులో.



పట్టాభిపురంలో అయ్యప్ప స్వామి గుడి చుట్టూ చేరిన వర్షపు నీరు



కంకరగుంట ఓవర్ బ్రిడ్జి వద్ద చెరువులా మారిన రోడ్డు

ప్రయాణికుల ఇక్కట్లు..

దసరా పండగ సెలవులు ముగించుకుని ఆదివారం సాయంత్రం సొంత వాహనాలు, రైళ్లు, బస్సుల్లో తిరుగు ప్రయాణమైన చాలామంది వర్షం కారణంగా ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా విజయవాడ - లింగంపల్లి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఆదివారం సాయంత్రం గుంటూరు రైల్వే స్టేషన్‌కు చేరుకునేసరికి వందలాది మంది ప్రయాణికులు ప్లాట్‌ఫాంపై ఉండటంతో ఈ రైలుని దాదాపుగా 10 నిమిషాల పాటు నిలిపేశారు. ప్రయాణికులు అంతా రైలు ఎక్కిన తర్వాతనే సిగ్నల్ ఇచ్చి పంపించారు. కొందరైతే సకాలంలో రైల్వేస్టేషన్ బస్టాండ్‌లకు చేరుకోలేకపోవడంతో వాళ్లు ఎక్కాల్సిన రైలు/బస్సులు అందుకోలేకపోయారు.

జీఎంసీలో కాల్‌సెంటర్ ఏర్పాటు

భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయన్న రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు జీఎంసీ కార్యాలయంలో 0863 2345103 నెంబరుతో ప్రత్యేకంగా కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పులి శ్రీని వాసులు ఆదివారం తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజ లు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటున్నందున తాగునీటి సరఫరాకి సమస్య రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఏఈలను, చెట్లు పడిపోతే తొలగించ డానికి సిబ్బందిని అందు బాటులో ఉంచుకోవాలని ఏడీహెచ్‌లను ఆదేశించారు.

రైస్ మిల్లులకు రేషన్

- తరలిపోతోన్న పేదల బియ్యం
- మాఫియాను పెంచిపోషిస్తోన్న మిల్లర్లు
- పాలిష్ పట్టి యథేచ్ఛగా అక్రమ రవాణా

పొన్నూరుటౌన్, గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం డీలర్ల నుంచి కార్డుదారులకు అందాలి. కానీ అనేక ప్రాంతాల్లో పేదల బియ్యం రైస్‌మిల్లులకు తరలిపోతోంది. పలు ప్రాంతాల్లోని రైస్‌మిల్లులు రేషన్ దందాకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. రైస్ మిల్లులు నడిపే వారే రేషన్ దందాలో ప్రస్తుతం కీలక పాత్ర వహిస్తున్నారని సమాచారం. రేషన్ బియ్యం పక్కదారి పట్టడాన్ని సహించేది లేదు.. కఠిన చర్యలు ఉంటాయి.. అక్రమార్కులపై పీడీ కేసులు నమోదు చేయడానికి కూడా వెనకాడం.. అంటూ కొన్ని నెలలుగా ప్రభుత్వం ప్రకటిస్తోంది. అయితే ఇవేవీ రేషన్ బియ్యం దొంగలకు పట్టడంలేదు. పైగా దందాను వ్యవస్థీకృతం చేసే దిశగా సరికొత్త రీతిలో ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వం మారినా రేషన్ దందా విషయంలో గతానికి, ఇప్పటికీ పెద్దగా తేడా లేకపోగా ముడుపుల మొత్తాలు పెరిగాయి. రేషన్ బియ్యం దందాలో సులువుగా కోట్లు వస్తుండటంతో రైస్ మిల్లర్లు దళారులను పెంచి పోషిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యం వ్యాపారానికి పొన్నూరు నిలయంగా మారగా ప్రస్తుతం నాటి దళారులు వ్యాపారాన్ని పొరుగు ప్రాంతానికి మార్చి కొనసాగిస్తున్నారు. ఆంక్షలు పెరగడంతో స్థానిక మిల్లర్లు బియ్యం కొనుగోలు చేయడంలేదు. ఇదే అదునుగా పొరుగు ప్రాంతాలకు చెందిన మిల్లర్లు స్థానిక దళారులను చేరదీసి వారికి అండదండలు అందించడమే కాకుండా తమ ప్రాంతంలోని మిల్లులకు బియ్యం సరఫరా చేసేలా ప్రోత్సహిస్తున్నారు. ఇక్కడి నుంచి బియ్యాన్ని చుండూరు, వట్టిచెరుకూరు, బాపట్ల ప్రాంతాల్లోని మిల్లులకు తరలిస్తున్నారు. సీజన్, అన్ సీజన్ పేరుతో కొనుగోళ్లు చేస్తున్నారు. సీజన్లో కిలో రేషన్ బియ్యానికి రూ.20 చెల్లిస్తే అన్ సీజన్లో రూ.18 చెల్లిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జరిగే రేషన్ అక్రమాలకు గుంటూరు ప్రధాన కేంద్రంగా ఉంది. గుంటూరు, ప్రత్తిపాడు తదితర ప్రాంతాల్లోని రైస్‌మిల్లులకు కూడా పలు ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం సరఫరా అవుతుంది. ఈ బియ్యాన్ని ఆయా మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి పాలిష్ పడుతున్నారు. అనంతరం ఆ బియ్యాన్ని రకరకాల బ్రాండ్ల పేరుతో అధిక ధరకు స్థానిక మార్కెట్లకు, ఇతర ప్రాంతాలకు తరలించి మిల్లర్లు రూ.కోట్లు గడిస్తున్నారు. లాభాలను ఆర్జించి పెట్టడంతో మధ్యవర్తులు, మిల్లర్లు రేషన్ బియ్యం దందాను ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కొనసాగిస్తున్నారు. ఈ రేషన్ దందాలో ప్రతి నెలా ఒక్కో ఎమ్మెల్యేకి రూ.10 నుంచి 15 లక్షలు మామూళ్లు ముడుతున్నట్లు సమాచారం. ఆ మొత్తం ఇవ్వాల్సిన బాధ్యత డీలర్లదే అన్నట్లు మాఫియా నిలువుదోపిడీకి పాల్పడుతున్నట్లు డీలర్లు చెబుతున్నారు.



ఇటీవల పొన్నూరులో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అర్బన్ సీఐ వీరానాయక్ తదితరులు

దాడులు.. బెదిరింపులు.. నిర్బంధాలు

పెట్టుబడి లేకుండా కాసుల వర్షం కురుస్తుండటంతో రేషన్ బియ్యం అక్రమార్కులు బరితెగిస్తున్నారు. రేషన్ దందాకు అడ్డొస్తే మాఫియా నిర్వాహకులు దాడులకు సైతం పూనుకుంటున్నారు. ఇటీవల చుండూరు ప్రాంతంలో రేషన్ బియ్యం దందాను అడ్డుకుంటున్న స్థానిక సోషల్ మీడియా ప్రతినిధులపై మిల్లర్లు దాడి చేసి బెదిరించారు. అంతేగాకుండా తమను అడ్డుకుంటే అంతు చూస్తామని బెదిరించినట్లు సమాచారం.

- ప్రత్తిపాడు నియోజకవర్గం వట్టిచెరుకూరు ప్రాంతంలో ఓ గ్రామంలోని మిల్లుకు తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన సోషల్ మీడియా ప్రతినిధులను సైతం అక్కడి మాఫియా నిర్వాహకులు దాడి చేసి బెదిరించినట్లు తెలిసింది.
- గుంటూరులో రేషన్ మాఫియా మాట విన్నారా సరే.. లేదంటే రేషన్ షాపుల డీలర్లు పని ఇక సరేసరి అన్నట్లుగా ఉంది. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో ఓ రేషన్ డీలర్ తమకు అడిగినంత బియ్యం సరఫరా చేయలేదని మాఫియా అతణ్ణి నిర్బంధించి, తమ డిమాండుకు అంగీకరించాకే వదిలింది.

తురకపాలెంలో మరో మహిళ మృతి 7

అమ్మ చెరవాణి బంధం.. విలపిస్తున్న పేగుబంధం! 4
- ఇద్దరు పిల్లలను వదిలేసి విజయనగరం నుంచి ప్రియుడి కోసం పిడుగురాళ్లకు..

అమ్మ చెరవాణి బంధం..

విలపిస్తున్న పేగుబంధం!

● విజయనగరం వివాహితకు భర్తతో విభేదాలు..

● ఇద్దరు పిల్లలను వదిలేసి.. ప్రియుడికోసం పిడుగురాళ్లకు..

● అమ్మ ఎక్కడంటూ పోలీస్‌స్టేషన్‌లో చిన్నారులు



పోలీస్‌స్టేషన్‌లో చిన్నారులు

పిడుగురాళ్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో చోటు చేసుకున్న ఓ హృదయ విదారకమైన ఘటన స్థానికులను కలచివేస్తోం ది. భర్తతో విభేదాల కారణంగా.. చరవాణిలో పరిచయమైన వ్యక్తి కోసం.. ముక్కుపచ్చలారని ఇద్దరు పిల్లను వదిలేసి ఓ తల్లి విజయనగరం నుంచి పిడుగురాళ్ల మండలంలోని తుమ్మల చెరువుకు చేరుకుంది. పిల్లల కోసమైనా.. తిరిగి వెళ్లాలని పెద్దలు, పోలీసులు నచ్చజెప్పినా ససేమీర అంటోంది. వివరాల్లోకి వెళ్తే విజయనగరం జిల్లాకు చెందిన ఓ మహిళ భర్తతో తరుచూ గొడవ పడుతూ ఉండేది. ఇదే సమయంలో తుమ్మలచెరువు గ్రామానికి చెందిన రాజేష్‌తో ఆమెకు ఫోన్‌లో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ఇద్దరి మధ్య వివాహేతర బంధానికి దారితీయడంతో.. ఆ మహిళ భర్తను వదిలి ఐదు నెలల క్రితం తుమ్మలచెరువులోని రాజేష్ వద్దకు చేరుకుంది. ఆ మహిళ కుటుంబ సభ్యులు విషయం తెలుసుకొని పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పోలీసులు, గ్రామపెద్దల ద్వారా నచ్చజెప్పి పిల్లలతో కలిసి ఉండేలా విజయనగరం పంపించారు. వారం క్రితం సదరు మహిళ మళ్లీ రాజేష్ వద్దకు చేరుకుంది. తల్లికోసం ముక్కు పచ్చలారని చిన్నారులు అమ్మా.. ఎక్కడున్నావని వెతుక్కుంటూ కుటుంబ సభ్యులతో కలిసి పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో చిన్నారుల తల్లిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. ఇద్దరు పిల్లలను వదిలి ఇక్కడికి వచ్చి ఉండడం సరైన పద్ధతి కాదని, పిల్లల జీవితాలు పాడైపోతాయని పెద్దలు, పోలీసులు నచ్చజెప్పారు. అయినా ఆ మహిళ భర్త దగ్గరకు వెళ్లేందుకు ససేమీర అనడంతో.. పోలీసులకు, గ్రామ పెద్దలకు ఏమి చేయాలో పాలుపోలేదు. పిల్లలతో కలిసి ఉండేలా బలవంతం చేస్తే ఏదైనా చేసుకుంటుందేమోననే సంశయంతో ఆ మహిళకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లో చిన్నారులకు పిడుగురాళ్ల పోలీసులే ఆహారం, మంచినీరు అందిస్తున్నారు. పలు పనుల మీద పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారు విషయం తెలుసుకొని ఇదేమి చోద్యం అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

ఆసక్తికరంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు



బండలాగుతున్న ఎడ్ల జత

క్రోసూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం గ్రామంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు ఆసక్తి కరంగా, ఉత్కంఠ భరితంగా జరుగుతున్నాయి. వివిధ జిల్లాలకు చెందిన ఎడ్ల జతలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నాయి. ఆదివారం నాలుగు పళ్ళ విభాగంలో ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పొట్లపాడుకు చెందిన మేడగం హర్ష వర్ధన్‌రెడ్డి ఎడ్ల జత 4,132.3 అడుగులు నిర్ణీత సమయంలో బండలాగి ప్రథమ స్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా పంగలూరుకు చెందిన చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్ల జత రెండవ స్థానంలోను, క్రోసూరు మండలం బయ్యవరం గ్రామానికి చెందిన కడియం మణికంఠ ఎడ్ల జత మూడవ స్థానంలోను నిలిచాయి. ప్రకాశం జిల్లా బెస్తావారిపేట బచినేపల్లికి చెందిన ఎడ్లకుండ్ల శ్రీనివాసులు, నరసరావుపేటకు చెందిన మనోజ్ చౌదరి, ప్రత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య చౌదరి, పెదకాకాణికి చెందిన ఆళ్ళ రాజేష్ యాదవ్, ప్రకాశం జిల్లా సీతారామపురం గ్రామానికి చెందిన పేరవరపు కార్తీక్ ఎడ్ల జతలు వరుసగా తరువాత స్థానాల్లో నిలిచాయి. ఆరు పళ్ళ విభాగంలో దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత నిర్ణీత సమయంలో నాలుగు వేల అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. కడప జిల్లా అయోధ్య నగర్‌కు చెందిన వెంకట సాయి భరత్‌రెడ్డి ఎడ్ల జత రెండవ స్థానంలోను, కృష్ణా జిల్లా యనమలకుదురుకు చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీ మధుకు చెందిన ఎడ్ల జతలు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. కేసానుపల్లికి చెందిన నెల్లూరి రామ కోటయ్య, కొల్లిపరకు చెందిన గుదిబండ శ్రీనివాసరెడ్డి, కృష్ణా జిల్లా మల్లవల్లికి చెందిన అక్కినేని సాన్వి చౌదరి, నంద్యాల జిల్లా గిడిగి రేవులకు చెందిన పెరుమాళ్ళ అంజయ్ కుమార్, గుంటూరు జిల్లా నవలూరుకు చెందిన బత్తుల శ్రీనివాసరావు ఎడ్ల జతలు తరువాత స్థానాల్లో నిలిచాయి. పోటీలను సమర్థంగా నిర్వహిస్తున్న బయ్యవరం పోలేరమ్మ తల్లి, లక్ష్మీ తిరుపతమ్మ కమిటీ వారిని పలువురు అభినందించారు. పోటీలు సోమవారం కూడా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

గంజాయి అక్రమ సరఫరా ముఠా అరెస్టు

● పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు

● రెండు కిలోల గంజాయి స్వాధీనం

● పరారీలో మరో ఇద్దరు యువకులు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకట్

మంగళగిరి సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి మంగళగిరి పరిసర ప్రాంతాల్లో అక్రమంగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న ముఠాను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ ఆదివారం నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ కేసులో మంగళగిరి మండలం బేతపూడి గ్రామానికి చెందిన బేతపూడి చందు, పెదవడ్లపూడికి చెందిన జొన్నలగడ్డ ఆనంద్, మంగళగిరి పట్టణం బాప్టిస్టు పేటకు చెందిన బుల్లా రవి, ఆత్మకూరుకు చెందిన కొండేటి తేజ, టిప్పర్ల బజారుకు చెందిన కంచర్ల చైతన్య, నిడమర్రుకు చెందిన దూరు లక్ష్మణరావును పోలీసులు అరెస్టు చేయగా, నవులూరుకు చెందిన సాత్విక్, నిడమర్రుకు చెందిన నగేష్ పరారీలో ఉన్నారు. వీరిలో చందు, స్వాతిక్, నగేష్ స్నేహితులు. వ్యసనాలకు అలవాటుపడి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయి కిలో రూ.5 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత 50 గ్రాముల చొప్పున చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి వాటిని మంగళగిరి పరిసర ప్రాంతాల్లో రూ.500 లెక్కన విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో తమ కస్టమర్లుగా వచ్చిన మిగతా నిందితులను కూడా గంజాయి విక్రేతలుగా మార్చి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. ఇటీవల చందు, సాత్విక్ పాడేరు కొండ ప్రాంతం నుంచి 2 కిలోల గంజాయిని తీసుకువచ్చి వాటాలు పంచుకునేందుకు మంగళగిరి ఏసీఏ క్రికెట్ స్టేడియం పరిసర ప్రాంతాలను ఎంచుకున్నారు. నిందితులు గంజాయి పంచుకుంటుండగా రూరల్ పోలీసులు దాడి చేసి.. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ రమేష్, హెడ్‌కానిస్టేబుల్ అంకమ్మరావు, కానిస్టేబుళ్లు రాము, సాగర్‌బాబు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గురుకుల విద్యాసంస్థల అభివృద్ధి

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు



సత్కారం పొందిన గురుకుల ఉపాధ్యాయులతో జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తదితరులు

గుంటూరు (విద్య) అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకులాల్లో విద్యనభ్యసించిన ఎందరో.. రాష్ట్ర ఉన్నతాధికా రులుగా ఎదిగారని ఆయా గురు కుల పాఠశాలల, జూనియర్ కళాశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సమాజ ంలోని ప్రతి ఒక్కరూ సహకరిం చాలని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పేర్కొన్నా రు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఏ దేశ అభివృద్ధిలోనైనా పాఠశాల విద్య ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. సమాజంలోని పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు గురుకులాలు ఒక వరమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గురుకులాలు అత్యున్నత విద్యా ఫలితాలు అందిస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ కనపరుస్తుండటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో వీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆచార్య వి.రాజు, రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్, తాడికొండ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.మధుసూదనరావు, ఫౌండేషన్ ఆహ్వాన కమిటీ కన్వీనర్ డాక్టర్ పీవీ మల్లేశ్వర్, రాపోలు జగన్, డి.గోవిందరెడ్డి, ఎ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గురుకుల ఉపాధ్యాయులను సందర్భంగా సత్కరించారు.

త్వరలో మెడికల్ ఇన్సూరెన్స్ పథకం



సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతో మంత్రి మనోహర్

● మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించేందుకు రూ.25 లక్షల మెడికల్ ఇన్సూరెన్స్ పథకానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలి క్యాంపు కార్యాలయంలో ఆదివారం 12 మందికి రూ.19,24,524 సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. నిధులు విడుదల కావడం పట్ల ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 4.24 కోట్ల తెల్ల రేషన్ కార్డు కుటుంబాలకు మెడికల్ ఇన్సూరెన్స్ పథకాన్ని త్వరలో ప్రకటిస్తామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు సీఎం సహాయ నిధి నుంచి 275 మందికి రూ.3.26 కోట్లు పంపిణీ చేశామన్నారు. ప్రజల నుంచి పలు సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం

● సినీ నటి హెబ్బా పటేల్



సభలో పాల్గొన్న సినీ నటి హెబ్బాపటేల్, సజీల, శిరీష

గుంటూరు మెడికల్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): రొమ్ము క్యాన్సర్‌పై మహిళలు అవగాహన పెంచుకోవాలని ప్రముఖ సినీ నటీ హెబ్బా పటేల్ సూచించారు. తక్కెళ్లపాడుకు చెందిన కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కోసం ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన హెబ్బా పటేల్, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, సిమ్స్ విద్యా సంస్థల అధినేత బి.శివశిరీష వాకథాన్‌ను ప్రారంభించారు. వాకథాన్‌లో సిమ్స్ నర్సింగ్ కళాశాల, సిబార్ డెంటల్ కాలేజీ విద్యార్థులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, యువతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేడియంలో జరిగిన బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన సభలో హెబ్బా పటేల్ మాట్లాడుతూ నలభై ఏళ్ల దాటిన ప్రతి మహిళ తప్పనిసరిగా బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ చక్ర హాస్పిటల్‌కు చెందిన వైద్య నిపుణుల బృందం రాము, మహతి, శ్రీఫణి, సుమన్, చంద్రశేఖర్, యశ్వంత్, ప్రియదర్శిని, హరీష్, రాకేష్ తదితరులు రొమ్ము కేన్సర్‌కు దారి తీసే కారణాలు, వ్యాధిని తొలి దశలో గుర్తించే పరీక్షలు, సూది పరీక్ష, వైద్య చికిత్సలు వంటి పలు అంశాలను వివరించారు.

రైల్వే ఉద్యోగుల..

పని ప్రదేశానికే.. హెల్త్ ఆన్ వీల్స్



సంచార వాహనంలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

గుంటూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నిత్యం విధి నిర్వహణలో ఉంటూ.. ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తూ అనారోగ్యం భారిన పడుతున్న రైల్వే కార్మికుల పని ప్రదేశానికే.. హెల్త్ ఆన్ వీల్స్ రైలుని తీసుకెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్లు రైల్వే సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆదివారం గుంటూరు - నడికుడి సెక్షన్‌లో ఈ సంచార రైలుని నడిపారు. మార్గమధ్యలో ఉన్న అన్ని రైల్వేస్టేషన్లలో ఈ వాహనాన్ని నిలిపి.. అక్కడి రైల్వే కార్మికులు, వారి పిల్లలకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. దాదాపుగా 158 మంది ఈ సంచార వైద్య సేవలను వినియోగించుకొన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీఎంవో డాక్టర్ వి.ప్రకాష్, డాక్టర్ బి.మహర్షి తదితరులు పాల్గొన్నారు.

ఎంత వరదొచ్చినా.. ఇక అమరావతి సేఫ్

(5వ పేజీ తరువాయి)

శాస్త్రీయ పద్ధతిలో పరిష్కరిస్తే రాజధాని అమరావతి భద్రంగా ఉంటుంది.

కమాండ్ కంట్రోల్‌తో అంతా సవ్యంగా...

ఈ మొత్తం వ్యవస్థను అన్నీ వేళల్లో నిర్వహించేందుకుగాను ఏపీసీఆర్‌డీఏ నూతన భవనంలో ఏర్పాటు చేస్తున్న అత్యాధునికమైన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఉపయోగపడనుంది. దీని ద్వారా రాజధాని ప్రాంతంలోని వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ ఏ సమయంలో ఎంత వర్షం కురుస్తుంది... ఏ రిజర్వాయర్‌లో నీరెంతుంది... కాలువల్లో నీరు ఏ పరిణామంలో ఎంత వేగంతో ప్రయాణిస్తుందనే అంశాలకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని సాంకేతికంగా తెలుసుకుంటూ తదనుగుణంగా రిజర్వాయర్‌లను బ్యాలెన్స్ చేస్తూ ఎత్తిపోతల పథకాలను నిర్వహిస్తారు. దరిమిలా అమరావతి నగర వీధుల్లో చుక్కనీరు కూడ నిలిచే పరిస్థితి ఉండదు. పైగా అమరావతిలో ప్రజల నీటి అవసరాలను తీర్చడంలో ఈ రెండు రకాల ప్రణాళికలు ఎంతో అద్భుతంగా ఉపకరిస్తాయి.

దిగువ పరీవాహక ప్రాంతంలో తొలిదశ పనులు

రాజధాని అమరావతిని వరదల కోణంలో.... కొండవీటివాగు పరీవాహక ప్రాంతాన్ని ఎగువ పరీవాహక, దిగువ పరీవాహక ప్రాంతమనే రెండు భాగాలుగా వర్గీకరించారు. రాజధానికి అత్యవసరంగా ముందు దిగువ పరీవాహక ప్రాంతంలో వరద జలాలను క్రమబద్ధీకరించే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఈ మొదటి దశ ప్రణాళికను అమలుకు రూ. 1,236.74 కోట్లను ఖర్చు చేస్తున్నారు. ఈ మేరకు సదరు పనులన్నింటిని ఎంవీఆర్ ఇన్‌ఫ్రా సంస్థ చేజిక్కించుకుని క్షేత్రస్థాయిలో పనులను ముమ్మరంగా నిర్వహిస్తుంది. వచ్చే ఏడాది చివరి నాటికి పనులన్నింటిని పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్(కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



గుంటూరు రైల్వేస్టేషన్‌లో జరిగిన అమృత్ సంవాద్‌లో పాల్గొన్న డీఆర్ఎం సుధేష్ణసేన్

రైలు ప్రయాణికులతో డీఆర్ఎం ముఖాముఖీ

● వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా అమృత్ సంవాద్ నిర్వహణ

గుంటూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా అమృత్ సంవాద్ కార్యక్రమాన్ని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణసేన్ నిర్వ హించారు. ఆదివారం సాయంత్రం గుంటూరు రైల్వేస్టేషన్‌లో వివిధ విభాగాల అధికారులతో కలిసి ప్రయాణికులతో రైల్వే సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలపై మాట్లాడారు. పలువురు ప్రయాణికులు డీఆర్ఎం, రైల్వే అధికారులతో సంభాషిస్తూ రైల్వేస్టేషన్ / రైళ్లలో సెల్‌ఫోన్ ఛార్జింగ్ సాకెట్లు, స్విచ్‌లు సరిగా పని చేయడం లేదన్నారు. అలానే టాయ్‌లెట్స్ క్లీన్‌గా ఉండటం లేదని తెలిపారు. రాత్రి వేళ గుంటూరుకు వచ్చి ఆగిపోయే పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైలుని తెనాలి వరకు పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం రమేష్‌కుమార్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, సీనియర్ డీవోఎం శ్రీనాథ్, డీసీఎం కమలాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఏ నూతన కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్ రామకృష్ణ

గుంటూరు(విద్య), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) నూతన కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రామకృష్ణ ఆదివారం ప్రారంభించారు. స్థానిక అంకమ్మనగర్‌లో ఏర్పాటు చేసినా నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎన్టీఆర్ కార్యకర్తలు, రాష్ట్ర కార్యదర్శి డి.హైమారావు, ఆర్‌యూపీ నాయకుడు సాంబయ్య పాల్గొన్నారు

ఫ్యాప్టో ధర్నాను జయప్రదం చేయాలి

● ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పెదబాబు

గుంటూరు (విద్య) అక్టోబరు 5 (ఆంధ్ర జ్యోతి): ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7న విజయవాడలో నిర్వహిస్తున్న ఫ్యాప్టో ధర్నాను విజయ వంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు విజ్ఞప్తి చేశారు. ఆదివారం కంకరగుంటలోని ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లా డారు. ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆయా సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పి.ప్రసాద్, పి.దిబ్బయ్య, పి.సుందర్ రావు, మేడా శ్రీనివాసరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు(విద్య), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలని, జూనియర్ కళాశాలల విశ్రాంత అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డి.వెంకటేశ్వర విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక మాజేటి గురవయ్య కళాశాలల సమావేశ మందిరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో ముఖ్యఅతిథి గా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది ప్రభుత్వ, ఎయిడెడ్ ఇంటర్మీడియట్ అధ్యాపకుల సమస్యలను సానుకూల దృక్పథంతో ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర నాయకులు భాస్కరరావు, రామచంద్రరావు, సుబ్బారావు తదితరులు పాల్గొ న్నారు.

సిపార్సు బదిలీలు నిలుపుదల చేయాలి : ఏపీటీఎఫ్

గుంటూరు(విద్య), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బదిలీల చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వం సిపార్సు బదిలీలు చేపట్టడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని, వెంటనే సిపార్సు బదిలీలను నిలిపివేయాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బసవ లింగారావు, మహ్మద్ ఖాలిద్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆరుగురు ఉపాధ్యాయులను కేటగిరీ 1, 2 పాఠశాలలకు బదిలీ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. కౌన్సెలింగ్‌కు విరుద్ధ బదిలీల ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలన్నారు.

లోకహితమైన విద్యను అభ్యసించాలి : ఏఎస్పీ

గుంటూరు (కార్పొరేషన్), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లోకహితమైన విద్యను అభ్యసించి సమాజాభి వృద్ధికి తోడ్పడాలని అడిషనల్ ఎస్పీ హనుమంతు తెలిపారు. ఆదివారం గుంటూరులోని ఏసీ కళాశాలలో జరిగిన విద్యార్థుల సమ్మేళనాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అడిషనల్ ఎస్పీ హనుమంతు ప్రసంగిస్తూ క్రమశిక్షణతో, సంస్కారంతో కూడిన విద్యను విద్యార్థులు అధ్యయనం చేస్తూ విజ్ఞానవంతమైన భారతదేశాన్ని సాధించాలన్నారు. ఎన్ఎంఎంఎస్ శిక్షణ శిబిరానికి హాజరైన 600 మంది విద్యార్థులకు 500 పేజీలతో కూడిన స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా పౌర సరఫరా శాఖాధికారి కె.శ్రీనివాస్ ప్రసంగిస్తూ ఎన్ఎం ఎంఎస్ శిక్షణ పోటీ పరీక్షలకు పునాదులు వేస్తుందన్నారు. మానవత కార్య దర్శి కె.సతీష్, డైరెక్టర్లు ఉప్పల సాంబశివరావు, చావా లక్ష్మీ సామ్రాజ్యం, కృష్ణ ప్రసాద్, అధ్యక్షులు కోటా శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్స్ గేరా ప్రకాష్ తదితరులు ప్రసంగించారు.

యువత పరిపూర్ణ వ్యక్తిత్వానికి ఎన్‌సీసీ దోహదం

గుంటూరు(విద్య), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సైనిక శిక్షణ అందిస్తూ సమాజంపై వారికి ఉన్న బాధ్యతను నెరవేర్చే విధంగా విద్యార్థులకు ఒక క్రమశిక్షణ కరమైన జీవితాన్ని అలవర్చేందుకు ఎన్‌సీసీ తోడ్పడుతుందని ఏపీ ట్రెక్ మేనేజర్ కల్నల్ సుధాంశు దుబే తెలిపారు. వారం రోజులుగా స్థానిక ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ సీసీ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఏపీ ఏపీ ట్రెక్ క్యాంప్ ఆదివారం ముగిసింది. క్యాంపులో ఏపీ తెలంగాణ డైరెక్టరేట్‌లోని 9 గ్రూపులకు సంబంధించిన 510 మంది ఎన్‌సీసీ విద్యార్థినులు పాల్గొన్నారు. కల్నల్ దూబే మాట్లాడుతూ ఎన్‌సీసీ వల్ల యువతలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డిప్యూటీ క్యాంపు కమాండెంట్ కల్నల్ ఉదయ్‌కుమార్, ఎన్‌సీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బుడంపాడు బైపాస్ వద్ద కారుకు తగిలిన లారీ

● ఇరువైపులా భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం

గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర శివారు బుడంపాడు సమీపంలో ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఓవర్‌టేక్ చేసే సమయంలో కారుకు లారీ తగిలింది. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే కారు డ్యామేజ్ అయిందని పరిహారం చెల్లించాలంటూ బైపాస్‌పై లారీని అడ్డుకున్నారు. దీంతో తెనాలి-గుంటూరు రహదారిలోనూ, బైపాస్ సర్వీస్ రోడ్డులోనూ కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న నల్లపాడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వాహనాలను పక్కకు తప్పించారు. దీంతో సుమారు 45 నిమిషాలకు వాహన రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.

గురుపీఠ పురస్కార గ్రహీత కాశింబికి అభినందనలు

గుంటూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన హిందీ ప్రేమిమండలి ఆధ్వ ర్యంలో విశ్రాంత హిందీ అధ్యాపకురాలు, రచయిత్రి షేక్ కాశింబి హిందీ భాషకు, సాహిత్య రంగంలో చేసిన విశేష కృషికి గురుపీఠ పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఆదివారం గుంటూరు జిల్లా రచయితల సంఘం తరఫున పురస్కారం అందుకున్న సంఘ సభ్యులు షేక్ కాశింబిని సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని, బుర్రి కుమార్ రాజు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.



కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలియజేస్తున్న శ్రీశైలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు బోడేపూడి సుబ్బారావు

జాతి భవిష్యత్తును తీర్చిదిద్దేలా విద్యార్థులను తయారు చేయాలి

● రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్‌పర్సన్ రత్నషీలామణి



సమావేశంలో మాట్లాడుతున్న రత్నషీలామణి

గుంటూరు(విద్య), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతి భవిష్యత్తును నిర్దేశించే విధంగా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని ఉన్నత విద్యా మండలి వైస్ చైర్‌పర్సన్ రత్న షీలామణి సూచించారు. ఆదివారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కేవీఆర్ ఎడ్యుకేష నల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సం దర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఏఐ వంటి సాంకేతిక సాధనాలు ఎన్ని వచ్చినా ఉపాధ్యాయులకు సాటి రావని అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్య క్షులు నక్క వెంకటేశ్వర్లు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వ సురేష్, వీజీఎస్ పబ్లిషర్స్ అధినేత రామారావు, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు.

కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో కార్యకర్తల రగడ

● రాష్ట్ర ఇన్‌చార్జ్ సమక్షంలోనే ఘర్షణ

● పార్టీ సీనియర్లను గుర్తించటం లేదని ఆగ్రహం



సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు, వారిస్తున్న జేడీ శీలం

గుంటూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ భవన్‌లో ఆదివారం జరిగిన కాంగ్రెస్ జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో గంద రగోళం నెలకొ న్నది. ఏకంగా ఏఐసీసీ కార్యదర్శి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఫలక్‌వర్మ, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం సమక్షంలోనే కార్యకర్తలకు ఘర్షణకు దిగారు. పార్టీలో సీనియర్లను గుర్తించటం లేదని, కనీసం ప్రొటోకాల్ పాటించటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ అధ్యక్షతన ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఫలక్‌వర్మ, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, మాజీ ఎమ్మెల్యేలు లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ మస్తాన్‌వలీల సమక్షంలో కాంగ్రెస్ విస్తృత స్థాయి సమా వేశం జరిగింది. సమావేశం జరుగుతుండగా మధ్యలో మాజీ ఎమ్మె ల్యే మస్తాన్‌వలి అనుచరులు, ఇతర కార్యకర్తలు లేచి పార్టీ నాయకులు కనీసం ప్రొటోకాల్ పాటించటం లేదని, ఇటీవల వేసిన ఫ్లెక్సీలలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ, సీనియర్ నేత అయిన లింగంశెట్టి ఫొటోలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ ఏకపక్షంగా వ్యవహ రిస్తూ సీనియర్లను పట్టించుకోవటం లేదని అన్నారు. రాష్ట్ర ఇన్‌ఛార్జ్ సర్దిచెప్పే ప్రయత్నం చేయబోగా వినిపించుకోకపోవటంతో జేడీ శీలం జోక్యం చేసుకొని కార్యకర్తలను వారించారు. దీంతో అందరూ మిన్నకుండిపోవటంతో సభ సజావుగా సాగింది.

ఓట్ల చోరీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి : రాష్ట్ర ఇన్‌ఛార్జ్ ఫలక్‌వర్మ

దేశంలో ఓట్ల చోరీతో బీజేపీ సారథ్యంలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడిందని, ఇదే విషయాన్ని కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ ఫలక్‌వర్మ పిలుపునిచ్చారు. అలానే బిహార్‌లోనూ 60 లక్షలకు పైగా ఓట్లను తొలగించారని విమర్శించారు. మరోవైపు ఎన్నికల కమిషన్ కూడా బీజేపీ పెద్దలతో కుమ్మక్కైన ట్లు ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ శ్రీపతి ప్రకాశం, ఏపీసీసీ నాయకులు కొరివి వినయ్‌కుమార్, మదన మోహన్‌రెడ్డి, బిళ్ళా సునీల్ ఉన్నారు.

నేడు జిల్లా స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం

గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర అవార్డుల జిల్లా స్థాయి ప్రదానం చేసే కార్యక్రమం ఈ నెల 6వ తేదీన సోమవారం జరుగుతుందని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవార్డుల బహూకరణ కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగుతుందని చెప్పారు.

ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ సేవకుమార్



డాక్టర్ తాతా సేవకుమార్

గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ తాతా సేవకుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక జీఎంఏ హాల్లో నిర్వహించిన 2025-26 ఆర్థిక సంవత్సరం కార్యవర్గం ఎన్నికల్లో సేవ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎం శివప్రసాద్, కార్యదర్శిగా డాక్టర్ బీ సాయికృష్ణ, సంయుక్త కార్యదర్శిగా చిలకా శ్రీనివాసరెడ్డి, కార్యవర్గ సభ్యు లుగా మరో 25 మంది ఎన్నికయ్యారు.

బీసీ ఉద్యోగుల పదోన్నతుల్లో మెరిట్ విధానం అమలు చేయాలి

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగుల పదోన్నతుల్లో మెరి ట్, రోస్టర్ విధానం అమలు చేయాలని బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివ పూర్ణయ్య తెలిపారు. ఆదివారం గుంటూరు తాలుకా పెన్షనర్స్ హోమ్‌లో బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సమావేశం జరిగింది. శివ పూర్ణయ్య మాట్లాడుతూ ఈ నెల 19న జరగబోవు బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ద్వితీయ మహాసభలో బీసీ ఎంప్లా యిస్ సమస్యలు, చర్చించవలసిన విషయాలు, బీసీ ఉద్యోగులకు రిజర్వేషన్లు, ప్రొమోషన్స్ లో మెరిట్ కమ్ రోస్టర్ విధానం అమలుచేయడానికి తీసుకొనవలసిన చర్యలు మీద చర్చిస్తానన్నారు. ఈ సమావేశంలో సలహా మండల చైర్మన్ ఎంవీ సత్యనారాయణ, వ్యవ స్థాపక అధ్యక్షుడు ఎంవీ ప్రసాద్, గౌరవధ్యక్షుడు పీవీ రమణయ్య, గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు మేకల సుబ్బా రావు, రాజవరపు సాంబయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎ.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అండర్ 19 జట్ల ఎంపికలు

గుంటూరు(క్రీడలు), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ 19 బాల బాలికల జట్ల ఎంపికలను ఈ నెల 7 నుంచి 10 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు తెలిపారు. ఎంపికలు నిర్వహిస్తున్న ప్రాంతాల ను, తేదీలను, నిర్వాహకుల వివరాలను తెలియజేశారు. ఈనెల 7వ తేదీన బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, రగ్బీ, ఎంపికలు జరుగుతాయని బ్యాడ్మింటన్ సత్తెనపల్లి, మున్సిపల్ ఇండోర్ స్టేడియం నందు నిర్వాహకుడు పి.శివకృష్ణ (8712129398), బాస్కెట్ బాల్ చిలక లూరిపేట, ఏఎంజీ పాఠశాలలో నిర్వాహకుడు రాజు (7075001306), రగ్బీ అచ్చంపేట, ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ జూనియర్ కళాశాలలో ఎం ప్రకాష్ (9963336877), ఈనెల 8న కబడి తాడికొండ, బీఎస్ఎస్‌బీ జూనియర్ కళాశాలలో ఎం నాగరాజు (9666073717), ఖోఖో పోటీలు 9న బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, అమరావతిలో నిర్మల పుష్పరా ణి (9010319483), క్రికెట్ 10న వడ్లమూడి విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్ సుధా కర్ రెడ్డి (9849967983) లను సంప్రదించవలసినదిగా కోరారు.

బహిరంగ మద్యపానంపై డ్రోన్‌లతో నిఘా

గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డ్రోన్ కెమెరాలతో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న మందు బాబులను గుర్తించి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, వెస్ట్ డీఎస్పీ అరవింద్ ఆధ్వర్యంలో నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో దాడులు కొనసాగాయి. నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, సౌత్ డీఎస్పీ భానోదయ, తెనాలి డీఎస్పీ జనార్దన్, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలోనూ బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగే వారిపై దాడులు నిర్వహించారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు రోషన్

గుంటూరు(క్రీడలు), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు జరిగే 41 జాతీయ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న ఎస్‌కే రోషన్ ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొంటున్నందుకుగాను ఏపీ రెరా సభ్యులు దామచ ర్ల శ్రీనివాసరావు ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో రోషన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, కే సత్యనారాయణ, అథ్లెటిక్స్ శిక్షకులు బీ రామకృష్ణ, కే రవి, కే అరుణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

సెలూన్, స్పా కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

● జేసీ శ్రీవాస్తవ

గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా సెలూన్, స్పా తదితర వాణిజ్య కార్యకలాపాలు జరిగే కేంద్రాల్లో సోమవారం పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత అధికారులను ఆదేశించారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ఆదివారం ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 7, 8 తేదీల్లో జిల్లాలో పాఠశాలలు, కళాశాలలు తదితర అన్ని విద్యాసంస్థల్లో సూపర్ జీఎస్టీ సూపర్‌సేవింగ్స్‌పై కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. విద్యాసంస్థల్లో వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం తదితర పోటీలను నిర్వహించాలని సూచించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ బీ గీతామాధురి, డీఈవో రేణుక తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

గుంటూరు, అక్టోబరు 5(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ కోరారు. నల్లపాడు రోడ్డులోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల జనగణన చేసి జనాభా దామాషా నిష్పత్తి ప్రకారం స్థానిక సంస్థ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వర రావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా అశోక్, రమణ తదితరులున్నారు.



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, డాక్టర్ నిమ్మల శేషయ్య

ఓజీ సినిమా మరిన్ని రికార్డులు సాధించాలి

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన ఓజీ సినిమా మరిన్ని రికార్డులు సాధించాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మ సాని చంద్రశేఖర్ ఆకాంక్షించారు. గుంటూరులో పవనిజం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే మోహన్ గోపికృష్ణ ఆధ్వర్యంలో ఓజీ సినిమా విజయోత్స కార్యక్రమం జరిగింది. ఈ సం దర్భంగా టీడీపీ బీసీ సీనియర్ నాయకుడు నిమ్మల శేషయ్యతో కలిసి ఆయన పాల్గొని కేక్ కట్ చేసి సినిమా బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఓజీ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని హర్షం వ్యక్తం చేశారు. విడుదలైన ప్రతి సెంటర్లో 100 రోజులు పైగా ప్రదర్శించాలని ఆకాంక్షించా రు. కార్యక్రమంలో పవనిజం అసోసియేషన్ సభ్యులు రమణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

అభివృద్ధికి నోచుకోని విలీన పంచాయతీలు

● పాలకవర్గాలు లేక నిలిచిన ఆర్థిక సంఘం నిధులు

పొన్నూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరు మండలంలో విలీన పంచాయతీల అభివృద్ధి అందని ద్రాక్షాగా మారింది. గత ఆరేళ్లగా పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో కోట్లాది రూపాయల ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. పంచాయతీల్లో నిధులు లేక ప్రజలకు అవసరమైన అభివృద్ధి జరగక విలీన పంచాయతీల దుస్థితి అగమ్యగోచరంగా ఉంది. గత ప్రభుత్వ పాలకులు చేసిన తప్పిదాలు పంచాయతీ ప్రజల పాలిట శాపంగా మారాయి.

ఆరేళ్లుగా అభివృద్ధికి దూరం

పొన్నూరు మండలంలోని చింతలపూడి, వడ్డిముక్కల, ఆలూరు, కట్టెంపూడి, కసుకర్రు, ఇటికంపాడు గ్రామాలను నాటి వైసీపీ పాలకులు రాజకీయ కారణాలతో పురపాలక సంఘంలో విలీనం చేయాలని ప్రతిపాదించారు. భౌగోళికంగా పురపాలక సంఘంతో అనుసంధానం లేని గ్రామాల ప్రజలు ఈ ప్రతిపాదనను బహిరంగంగానే తిరస్కరించారు. కానీ వైసీపీ పాలకులు విలీన ప్రతిపాదనపై ముందుకే వెళ్లి ప్రభుత్వ ఉత్తర్వులు తీసుకువచ్చారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధంగా తెచ్చారని ఆరోపిస్తూ విలీన పంచాయతీలు హైకోర్టును ఆశ్రయించాయి. హైకోర్టు స్టే విధించడంతో పంచాయతీల్లో ఎన్నికలు జరగలేదు సరికదా పొన్నూరు పురపాలక సంఘానికి కూడా ఎన్నికలు నిలిచిపోవడంతో ఆరు పంచాయతీలతో పాటు పురపాలక సంఘానికి నిధులు ఆగిపోయాయి. అయితే పురపాలక సంఘం ఇతర ఆదాయ మార్గాల్లో నిధులు తెచ్చుకుని అభివృద్ధి పనులు చేస్తుంటే


వడ్డిముక్కల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న సచివాలయ భవనం

ఈ ఆరు పంచాయతీలకు ఇతర ఆదాయ మార్గాలు లేకపోవడంతో దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. వడ్డిముక్కల గ్రామంలో నిర్మించిన రు.40 లక్షల సచివాలయ భవనం కూడా నిరుపయోగంగా మారింది. తాగునీరు, వీధి దీపాలు ఏర్పాటు చేయడానికి కూడా పంచాయతీలు అప్పులపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. వచ్చే మార్చి నెలతో రాష్ట్రంలోని స్థానిక సంస్థల పాలకవర్గాలు ముగియనున్న నేపథ్యంలో ఈ ఆరు నెలల వ్యవధిలోనైనా విలీన పంచాయతీల సమస్యలు పరిష్కరించి ఎన్నికలు జరిపించాలని ప్రజలు వేడుకుంటున్నారు. లేకపోతే పంచాయతీల మనుగడే పూర్తిగా ప్రశ్నార్థకరంగా మారే పరిస్థితి ఉత్పన్నమవుతుందని ఆరు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పాఠశాలకు చేరిన ల్యాబ్ సామగ్రి

పీఎంశ్రీ పాఠశాలలకు ప్రయోగశాలల మెటీరియల్

తెనాలి అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ పథకం అమలు అవుతున్న ఉన్నత పాఠశాలలకు ప్రయోగశాలల మెటీరియల్ ఇబ్బడిముబ్బడిగా అందుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రధాన మంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా పథకాన్ని ప్రవేశ పెట్టింది. 400 మంది విద్యార్థులకు పైగా ఉన్న ఉన్నత పాఠశాలల్లో మొదటి విడత ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ పాఠశాలల్లో కెమిస్ట్రీ ల్యాబ్‌ల నిర్మాణం, ఆటస్థలం అభివృద్ధి, కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, మినరల్ వాటర్ ప్లాంటు, సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ ప్రయోగశాలల కోసం అవసరమైన పరికరాలను సరఫరా చేస్తున్నారు. రూ.15 లక్షలతో నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్‌లలో విద్యార్థులు ప్రయోగాలు చేసేందుకు అవసరమైన సరంజామా అందించారు. పాఠశాలల్లో ఉన్న ఫిజిక్స్, బయోలజీ ల్యాబ్‌ల్లో ప్రయోగాలు చేసేందుకు అవసరమైన గ్రానైట్ బల్లలను ప్రయోగ సామగ్రి, కెమికల్స్ అందిస్తున్నారు. భారీగా వస్తున్న ఈ సామాగ్రిని ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు ఆయా ప్రయోగ శాలల్లో అమర్చి విద్యార్థులకు ప్రయోగాల పాఠాలను బోధించాలని సమగ్ర శిక్షా అధికారులు ఆదేశించారు.

హిందీ ప్రచారానికి బోయపాటి దంపతుల కృషి ఎనలేనిది

తెనాలి అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : హిందీ భాషను ప్రచారం చేసేందుకు బోయపాటి గురుదంపతులు చేసిన కృషి ఎనలేనిదని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం హిందీ విభాగం ప్రొఫెసర్ నారాయణ అన్నారు. నాజరుపేటలోని హిందీ ప్రేమీ మండలిలో బోయపాటి నాగేశ్వరరావు, సుభద్రాదేవి గురు దంపతుల పురస్కారాన్ని ఆదివారం ఆయనకు ప్రదానం చేశారు. రావెళ్ల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, మహాత్మాగాంధీ కాలు మోపిన పవిత్ర ప్రదేశంలో తనకు పురస్కారం లభించడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు హైస్కూల్ దశలో హిందీ నేర్చుకుంటే ఉత్తర భారతదేశంలో ఉన్నత విద్య, ఉద్యోగాల సమయంలో ఎంతో ప్రయోజనం లభిస్తుందన్నారు. మరో పురస్కార గ్రహీత, విశ్రాంత అధ్యాపకురాలు షేక్ ఖాసీంబీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మాతృభాషతో పాటు హిందీ భాషను నేర్చుకోవడం వల్ల మంచి పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. దక్షిణ భారత దేశంలో హిందీ ప్రచారానికి మోటూరి సత్యనారాయణ ఎంతో కృషి చేశారని చెప్పారు. బోయపాటి దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెన్నా వల్లభరావు, గురుకుట్ల మంజుల, నాగళ్ల దుర్గారఘురామ్ ప్రసంగించారు.

ఓటర్ల జాబితాలను పారదర్శకంగా రూపొందించాలి

తెనాలి అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలను పారదర్శకంగా రూపొందించేందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు డిమాండ్ చేశారు. ఆదివారం బోసురోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను అడ్డం పెట్టుకుని ఓటర్ల జాబితాలను ఇష్టం వచ్చినట్లుగా రూపొందించుకుంటూ అక్రమాలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఆ పార్టీ గెలుస్తున్న రాష్ట్రాల్లో ఓట్లను చోరీ చేసే కార్యక్రమం పెద్ద ఎత్తున సాగుతుందని, దీన్ని దేశ వ్యాప్తంగా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతుందన్నారు. పార్టీ నాయకులు పొన్నూరు నాగసూర్యశశిధర్, దారా రామకృష్ణ, గుర్రపు ద్వారక శ్రీనివాస్, శివకుమార్, స్టీవెన్‌బాబు, అయ్యప్ప, శ్రీను పాల్గొన్నారు.

ఫ్యాప్టో ధర్నాకు తరలిరావాలి

తెనాలి అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పోరుబాట ధర్నాకు తరలిరావాలని జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ కె.నరసింహారావు కోరారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో తెనాలి డివిజన్ ఫ్యాప్టో సమావేశం ఆదివారం ఛైర్మన్ డివి సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న నిర్వహిస్తున్న ధర్నాకు ఉపాధ్యాయులంతా హాజరుకావాలని చెప్పారు. విజయవాడకు సమీపంలోని జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలోనే ఉపాధ్యాయులు హాజరైతేనే ప్రభుత్వం మన పోరాటాన్ని గుర్తిస్తుందన్నారు. ఐఆర్ ప్రకటన, బకాయిల చెల్లింపు, పీఆర్‌సీ ఏర్పాటు వంటి ఎన్నో సమస్యల సాధనకు పోరాటమే శరణ్యమన్నారు. సంఘ నాయకులు రామచంద్రయ్య, జిలాని, లక్ష్మణ్, శ్రీధర్, మిధున్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘ అభివృద్ధికి కృషి

తెనాలి అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : గౌడ సంఘీయుల అభివృద్ధికి కృషి చేయాలని నియోజకవర్గ గౌడ సంఘ కన్వీనర్ కుంభం బాలాజీ అన్నారు. ఆదివారం డివిజన్ గౌడ సంఘ కార్యాలయంలో వడ్లమూడి బాలకోటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ అనంత లక్ష్మీనారాయణను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, ఐక్యంగా ఉండి సమస్యలు సాధించుకున్నామన్నారు. పేదవారికి ప్రభుత్వ పథకాలు అందేలా కమిటీ కృషి చేస్తుందన్నారు. వీరంకి రంగారావు, తుళ్లూరు శ్రీనివాసరావు, చెన్ను శ్రీనివాసరావు, గిరి గణేష్, సుబ్బరామయ్య పాల్గొన్నారు.


లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న గౌడ సంఘ నాయకులు

గాలితో కూడిన వర్షం


● పల్లపు ప్రాంతాలు జలమయం

కొల్లిపర, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు గాలితో కూడిన వర్షం పడింది. దీంతో రోడ్లు అన్నీ జలమయమయ్యాయి. వర్షపు నీటికి మురుగు కాల్వల్లోని నీరు ఎక్కడికక్కడ స్తంభించాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో జనజీవనానికి అంతరాయం కలిగింది. మండల కేంద్రం కొల్లిపరలో ప్రధాన రహదారులు సైతం నీటితో నిండిపోగా డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. దీంతో మురుగునీరు రోడ్లపైకి చేరడంతో పాదచారులకు అసౌకర్యం కలిగింది. వాహనదారులు కూడ పలు ఇబ్బందులకు గురయ్యారు. అదేవిధంగా తూములూరు, దావులూరు, చివలూరు, జెముడుబాడు, దావులూరిపాలెం తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు సైతం వర్షం నీటితో నిండిపోయాయి. రహదారులపై గజంలోతు నీరు చేరడంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు.


కొల్లిపరలో వర్షానికి జలమయమైన రోడ్డు

ఐజేయూ కౌన్సిల్ సభ్యుడిగా సుబ్బారావు

తెనాలి అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఐజేయూ కౌన్సిల్ సభ్యుడిగా తెనాలికి చెందిన చందు సుబ్బారావు ఎన్నికయ్యారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఐజేయూ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీ నుంచి 52 మందిని కౌన్సిల్ సభ్యులుగా తీసుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఆరుగురు ఎన్నికయ్యారని, తెనాలి ప్రాంతం నుంచి సుబ్బారావుకు అవకాశం లభించిందని తెలిపారు.


చందు సుబ్బారావు


కొల్లిపరలో వరికి తెగుళ్ళు సోకడంతో మందులను పిచికారీ చేస్తున్న రైతు

వరిలో తెగుళ్ళ ఉధృతి

● ఆందోళనలో రైతులు

కొల్లిపర, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : వరిపైరుపై ఒకవైపు ఎలుకలు, మరో వైపు తెగుళ్ళు దాడి చేస్తున్నాయి. తెగుళ్ళ ఉధృతి పెరగడంతో పాటు సుడిదోమపడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పంటను కాపాడుకోవడానికి రైతులు శత విధాలా ప్రయత్నిస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు మేరకు రైతులు తెగుళ్ళను, దోమను అరికట్టటానికి ఉధృతంగా మందులను పిచికారీ చేస్తున్నారు. దీంతో పురుగుమందుల భారంతో రైతులు డీలాపడుతున్నారు. మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం, కొల్లిపర, తూములూరు, హనుమాన్‌పాలెం, అత్తోట, సిరిపురం, చివలూరు, దంతలూరు, కుంచవరం, దావులూరు, చక్రాయపాలెం గ్రామాల్లో రైతులు ఎక్కువ శాతం బీపీటీ వరి వంగడాలను సాగు చేశారు.

వరిపైరు చిరుపొట్టదశకు రావడంతో పొడతెగులు, ఆకుచుట్టు తెగులుతో పాటు సుడిదోమపడటంతో పైరు ఎదు గుదలకు నోచుకోవటంలేదు. ఇది వరి దిగుబడులపై ప్రభావం చూపుతోందని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. పురుగు మం దులు పిచికారి చేస్తున్నా సుడిదోమ తగ్గకపోవడంతో పాటు తెగుళ్ళు కూడా అదుపులోకి రావడంలేదని రైతులు తెలుపుతున్నారు. దీనికితోడు వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం

పెదకాకాని, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి పెదకాకాని గ్రామ వాస్తవ్యులు కానుగంటి రాధాకృష్ణమూర్తి ధర్మపత్ని సామ్రాజ్యం పేరు మీద వారి కుమారుడు కానుగంటి హరిబాబు ధర్మపత్ని నాగేశ్వరి దంపతులు ఆదివారం రూ.1,00,116లు విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్ తెలిపారు. ప్రతి సంవత్సరం మహాలయ అమావాస్య రోజున దాతల పేరు మీద అన్న ప్రసాద వితరణ చేయవలసినదిగా కోరినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ మాట్లా డుతూ ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళం సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.


విరాళం ఇచ్చిన రాధాకృష్ణమూర్తి దంపతులకు మల్లేశ్వర స్వామి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ సిబ్బంది

గురు పీఠ పురస్కార గ్రహీత కాశంబికి అభినందనలు


కాశంబీని సత్కరిస్తున్న రచయితల సంఘం ప్రతినిధులు

గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెనాలికి చెందిన హిందీ ప్రేమి మండలి ఆధ్వర్యంలో విశ్రాంత హిందీ అధ్యాపకురాలు, రచయిత్రి షేక్ కాశంబి హిందీ భాషకు, సాహిత్య రంగంలో చేసిన విశేష కృషికి గురు పీఠ పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ఆదివారం గుంటూరు జిల్లా రచయితల సంఘం తరపున పురస్కారం అందుకున్న సంఘ సభ్యులు షేక్ కాశంబిని సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని, బుర్రి కుమార్ రాజు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. షేక్ కాశంబి భవిష్యత్తులో మరెన్నో పురస్కారాలు అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలియచేసారు.

నేడు జిల్లా స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం

గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర అవార్డుల జిల్లా స్థాయి ప్రదానం చేసే కార్యక్రమం ఈ నెల 6వ తేదీన సోమవారం జరుగుతుందని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవార్డుల బహూకరణ కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగుతుందని చెప్పారు.

చేబ్రోలు పంచాయతీకి జిల్లాస్థాయి స్వచ్ఛ అవార్డులు

చేబ్రోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా స్వచ్ఛ ఆంధ్ర ప్రోత్సాహక అవార్డులు-2025లో చేబ్రోలు గ్రామ పంచాయతీ ఘన విజయాన్ని సాధించింది. జిల్లాస్థాయిలో జరిగిన స్వచ్ఛ అవార్డుల బహూకరణ కార్యక్రమంలో చేబ్రోలు పంచాయతీకి స్వచ్ఛపంచాయతీ అవార్డు, నల్లపాటి రాఘవమ్మకు స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్ అవార్డు లభించాయి. స్వచ్ఛ ఆంధ్ర అవార్డు జిల్లాస్థాయి బహూకరణ కార్యక్రమం సోమవారం గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా కార్యకలాపాల్లో చేసిన ప్రశంసనీయ కృషిని గుర్తించి ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. చేబ్రోలు పంచాయతీ ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, బహిరంగ ప్రదేశాలలో శుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, తగ్గించటం– మరలా ఉపయోగించడం వంటి అంశాల్లో విశేషంగా పని చేసింది. పర్యావరణ పరిరక్షణలో సుస్థిర పద్ధతులలో కొత్త ప్రమాణాలను సృష్టించడం ద్వారా ఇతర పంచాయతీలకు ఆదర్శంగా నిలిచింది. ఈ సంవత్సరం ప్రభుత్వం మొత్తం 17 కేటగిరీలలో అవార్డులను ప్రకటించింది. అన్ని రంగాలలో ఉన్న వారి భాగస్వామ్యాన్ని పెంచుతూ, అసాధారణ ప్రతిభను గుర్తించడానికి స్వచ్ఛసర్వేక్షణ అవార్డులు ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.

గ్యార్మీ సందర్భంగా అన్నదానం

పొన్నూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరు పట్టణంలోని మార్కెట్ వద్ద గ్యార్మీ పండుగను పురస్కరించుకుని ఆదివారం అన్నదానం నిర్వహించారు. పీరానే పీర్ గౌసే ఆజాం దస్తగీర్ జెండా చెట్టు వద్ద గ్యార్మీ ప్రార్థనలు జరిగాయి. గత నెల 23న నెలవంక దర్శనంతో గ్యార్మీ మాసంను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా జెండాచెట్టు వద్ద పాలాభిషేకం నిర్వహించి గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నీషాన్ నిర్వాహకులు సయ్యద్ జైనుల్లా ఆధ్వర్యంలో 2000 మందికి అన్నదానం నిర్వహించారు.


అమృత్ సంవాద్‌లో పాల్గొన్న డీఆర్ఎం సుధేష్ణసేన్

రైలు ప్రయాణికులతో డీఆర్ఎం ముఖాముఖీ

● వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా అమృత్ సంవాద్ నిర్వహణ

గుంటూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా అమృత్ సంవాద్ కార్యక్రమాన్ని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణసేన్ నిర్వ హించారు. ఆదివారం సాయంత్రం గుంటూరు రైల్వేస్టేషన్‌లో వివిధ విభాగాల అధికారులతో కలిసి ప్రయాణికులతో రైల్వే సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలపై మాట్లాడారు. ప్రయాణికులు రైల్వేస్టేషన్, రైళ్లకు సంబంధించి ఏమేమి మెరుగుపడాలని ఆశిస్తున్నారనే విషయంపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించారు. పలువురు ప్రయాణికులు డీఆర్ఎం, రైల్వే అధికారులతో సంభాషిస్తూ రైల్వేస్టేషన్/రైళ్లలో సెల్‌ఫోన్ ఛార్జింగ్ సాకెట్లు, స్విచ్‌లు సరి గా పని చేయడం లేదన్నారు. అలానే టాయ్‌లెట్స్ క్లీన్‌గా ఉండటం లేదని తెలిపారు. రాత్రి వేళ గుంటూరుకు వచ్చి ఆగిపోయే పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైలుని తెనాలి వరకు పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం రమేష్‌కుమార్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, సీనియర్ డీవోఎం శ్రీనాథ్, డీసీఎం కమలాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అండర్ 19 జట్ల ఎంపికలు

గుంటూరు(క్రీడలు), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ 19 బాల బాలికల జట్ల ఎంపికలను ఈ నెల 7 నుంచి 10 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు తెలిపారు. ఎంపికలు నిర్వహిస్తున్న ప్రాంతాల ను, తేదీలను, నిర్వాహకుల వివరాలను తెలియజేశారు. ఈనెల 7వ తేదీన బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, రగ్బీ ఎంపికలు జరుగుతాయని బ్యాడ్మింటన్ సత్తెనపల్లి, మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో నిర్వాహకుడు పి.శివకృష్ణ (8712129398), బాస్కెట్ బాల్ చిలకలూరిపేట, ఏఎంజీ పాఠశాలలో నిర్వాహకుడు రాజు (7075001306), రగ్బీ అచ్చంపేట, ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ జూనియర్ కళాశాలలో ఎం ప్రకాష్ (9963336877), ఈనెల 8న కబడి తాడికొండ, బీఎస్ఎస్‌బీ జూనియర్ కళాశాలలో ఎం.నాగరాజు (9666073717), ఖోఖో పోటీలు 9న బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, అమరావతిలో నిర్మల పుష్పరాణి (9010319483), క్రికెట్ 10న వడ్లమూడి విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్ సుధా కర్ రెడ్డి (9849967983) లను సంప్రదించవలసినదిగా కోరారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు రోషన్

గుంటూరు(క్రీడలు), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు జరిగే 41 జాతీయ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న ఎస్‌కే రోషన్ ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొంటున్నందుకుగాను ఏపీ రెరా సభ్యులు దామచర్ల శ్రీనివాసరావు ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో రోషన్‌ను ఘనంగా సన్మానించారు. రోషన్‌కి కావలసిన సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, కే.సత్యనారాయణ, అథ్లెటిక్స్ శిక్షకులు బీ.రామకృష్ణ, కే.రవి, కే.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా పొన్నూరు

పొన్నూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డును పొన్నూరు పురపాలక సంఘం కైవసం చేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 18 నుంచి ప్రతి నెలా 3వ శనివారం స్వర్ణ, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పొన్నూరు పురపాలక సంఘాన్ని స్వచ్ఛ పొన్నూరుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సూచనలకు అనుగుణంగా 12 నెలలకు 12 అంశాలతో పొన్నూరు పురపాలక సంఘం కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో జిల్లా స్థాయిలో పొన్నూరు పురపాలక సంఘం స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డును పొందినట్లు తెలిపారు. అలాగే ఇతర కేటగిరిల కింద బెస్ట్ స్వచ్ఛ వారియర్‌గా పబ్లిక్ హెల్త్ వర్కర్ వడ్డాది శ్రీనివాసరావు, బెస్ట్ స్వచ్ఛ హాస్పిటల్‌గా పొన్నూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బెస్ట్ స్వచ్ఛ స్లం లెవల్ ఫెడరేషన్స్‌గా పట్టణంలోని అంబేద్కర్ కాలనీ మహిళాస్వయం సమాఖ్య, సిద్ధి వినాయకనగర్ మహిళా స్వయం సమాఖ్యలు ఎంపికైనట్లు తెలిపారు. నాలుగు కేటగిరీల్లో పొన్నూరు పురపాలక సంఘానికి స్వచ్ఛ అవార్డులను కలెక్టర్ కార్యాలయం ప్రకటించినట్లు వివరించారు. స్వచ్ఛ మున్సిపాలిటీగా పొన్నూరును తీర్చిదిద్దిన పట్టణ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, పురపాలక సంఘం సిబ్బందికి, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు కమిషనర్ రమేష్‌బాబు ధన్యవాదాలు తెలిపారు.


పొన్నూరు పురపాలక సంఘం

జనసేన నేతకు ఎమ్మెల్యే పరామర్శ

పొన్నూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : జనసేన నేత యన్నం నాయుడును ఆదివారం ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పరామర్శించారు. ఇటీవల యన్నం నాయుడు అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకుని వైద్యసేవలు పొందుతున్న సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే తెలగపాలెంలోని నాయుడు గృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యక్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


జనసేన నాయకుడు యన్నం నాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చేబ్రోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నారాకోడూరు ప్రధాన విద్యుత్ నియంత్రకల వద్ద జరుగుతున్న మరమ్మతుల కారణంగా నారాకోడూరు, గుండవరం, గొడవర్రు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. సోమవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మత్తు పనులు పూర్తయిన వెంటనే సరఫరా పునరుద్ధించబడుతుందని ఆయన తెలిపారు.

పాలస్తీనాపై దాడులను నిలిపివేయాలి

పొన్నూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పాలస్తీనాపై దాడులను ఇజ్రాయెల్ తక్షణమే నిలిపివేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. పొన్నూరు పట్టణంలో ట్రాలీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం జరిగింది. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. యూనియన్ అధ్యక్షుడు షేక్ రెడ్‌జానీ మాట్లాడుతూ మారణహోమం ప్రారంభమై రెండేళ్లు అవుతుండగా 70 వేల మంది పాలస్తీనా ప్రజలు హత్యగావించబడ్డారని ఆరోపించారు. ప్రపంచ దేశాల్లో ఇజ్రాయెల్ మారణహోమం మాయని మచ్చగా నిలుస్తుందని ఆరోపించారు. గాజాలో చిన్నారుల హత్యలు పాశవికంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు పాలస్తీనా ప్రజలకు మద్దతునివ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రసాద్, షేక్ బాజీ, షేక్ ఫరీదా, జానీ ఫరీదా, బాషా, షేక్ వజీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ట్రాలీ ఆటో యూనియన్ నాయకులు

కేసీ హైస్కూల్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చేబ్రోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూల్‌లో 1975-76 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం తమ పాఠశాలలో గెట్ టు గెదర్ పార్టీని నిర్వహించారు. స్కూల్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తివుతున్న సందర్భంగా త్వరలో జరగబోయే శతజయంతి ఉత్సవాల గురించి చర్చించారు. ప్రతి పూర్వవిద్యార్థి స్కూల్ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి చల్లా కాసింరెడ్డి అధ్యక్షత వహించారు.


కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

8 నుంచి ఆధార్ నమోదు కేంద్రాలు

తెనాలి అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : తపాలా శాఖలో ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ జి.బాలసరస్వతి తెలిపారు. తపాలా వారోత్సవాల్లో భాగంగా డివిజన్‌లోని ప్రజలకు ఉచిత ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్రాలలో అన్ని రకాల ఆధార్ సర్వీసులను పొందవచ్చన్నారు. దేవీ చౌక్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఈ నెల 8 నుంచి 9 వరకు, కొల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 10, 11 తేదీల్లో, రైల్వే స్టేషన్ రోడ్డులోని ఎన్నారై జూనియర్ కళాశాలలో 13, 14 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కేంద్రాలు పని చేస్తాయన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

అనుమానాస్పద రీతిలో వ్యక్తి మృతి

కాకుమాను, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదరీతిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన కాకుమానులో జరిగింది. గ్రామానికి చెందిన మాచవరపు వెంకటేశ్వరరావు (40) వాటర్ ట్యాంక్ వద్ద మురుగు కాలువలో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పైకితీశారు. అప్పటికే వెంకటేశ్వరరావు మృతి చెందాడు. మద్యం సేవించి ప్రమాదవశాత్తూ కాలువలోపడి మృతి చెందాడా లేక ఇతర కారణాల వల్ల చనిపోయాడా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాకుమాను ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులలో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ జి.సురేశ్‌బాబు తెలిపారు. మంగళగిరి కుప్పురావు కాలనీ, భార్గవపేట, దేవుడి మాన్యం, బాప్టిస్టుపేట, ఎన్‌సీసీ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8:30నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

● ఫిరంగిపురం: మండలంలోని రేపూడి, గొల్లపాలెం గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ దుర్గాప్రసాద్ ఆదివారం తెలిపారు.

మబ్బు పడితే.. కోతలే

వట్టిచెరుకూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై మండల వ్యాప్త గ్రామాల్లోని ప్రజానీకం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. మబ్బు పడితే వర్షం రాక పోయినా గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో ఓ పక్క దోమల మోత, మరో వైపు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. సంబంధిత మండల అధికారులకు ఫోన్‌చేస్తే సరైన సమాచారం ఇవ్వడంలేదు. పైస్థాయిలోనే విద్యుత్‌ను నిలిపివేస్తున్నారని ఇందులో తమ ప్రమేయం ఏమీలేదని పేర్కొంటున్నారు. ఉన్నతస్థాయి అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఒకే కాన్పులో రెండు దూడల జననం

తాడేపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలోని కుంచనపల్లిలో ఓ ఆవు ఒకే కాన్పులో రెండు దూడలకు ఆదివారం జన్మనిచ్చింది. స్థానిక అరవింద హైస్కూల్‌కు చెందిన గోశాలలో ఉన్న ఒంగోలు జాతి ఆవుకు రెండు దూడలు జన్మించాయి. ఇలాంటి కాన్పులు చాలా అరుదుగా జరుగుతాయని పశుసంవర్ధక అధికారులు తెలిపారు. ప్రస్తుతం రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని అన్నారు. కాగా, దూడలను చూసేందుకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో వస్తున్నట్లు గోశాల సంరక్షకుడు శంకర్‌రెడ్డి తెలిపారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద

తాడేపల్లి టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 2 లక్షల 657 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదయినట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 1లక్ష 82వేల 175 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 10,085 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 8,216 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదలను నిలిపివేశారు.

అంబేడ్కర్ విగ్రహ దుర్ఘటనలో దోషులను శిక్షించాలి: మాల్యాద్రి

తాడేపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలోని దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన దుండగులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడాన్ని నిరసిస్తూ గుండిమెడలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేవీపీఎస్ మండల కార్యదర్శి పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాల్యాద్రి మాట్లాడుతూ, అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం అతి దుర్మార్గమైన చర్య అని అన్నారు. దళితుల మధ్య ఐక్యతను దెబ్బతీసేందుకే ఇలాంటి దుర్మార్గమైన చర్యలు చేశారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్రంలో బీజేపీ వచ్చాక దళితులపై దాడులు పెరిగాయన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నేతలు జోషి, విజయరాజు, శాంసోను, చిన్నప్ప, కృష్ణ, పవన్ పాల్గొన్నారు.

కుమ్మర శాలివాహన సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

ఫిరంగిపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని అల్లంవారిపాలెంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలి వాహన సంక్షేమ సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ ఆధ్వర్యంలో తాడికొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా వరికల్లు నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్, కోశాధికారిగా ఎస్.కొండలు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఫిరంగిపురం మండల అధ్యక్షుడిగా మొగిలిపాలెం ఏడుకొండలు, ఉపాధ్యక్షుడిగా నిడమానూరి రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కుమ్మర శాలివాహన సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పేరేటి ఈశ్వర్ ఎన్నికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, పట్టణ యువజన కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఆర్అండ్‌బీ భవనం

● ఏళ్లు గడుస్తున్నా కన్నెత్తి చూడని అధికారులు



తాడికొండలో నిరుపయోగంగా ఉన్న ఆర్అండ్‌బీ కార్యాలయం

తాడికొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏళ్లకేళ్లగా ఆర్అండ్‌బీ భవనం నిరుపయోగకంగా ఉంది. భవనం తాళాలు తీసి ఏళ్లు గడుస్తున్నా అధికారులు మాత్రం కార్యాలయం వైపు కన్నెత్తి చూడటం లేదు. పేరుకే కార్యాలయం కానీ సిబ్బంది ఒక్కరోజు కూడా స్థానికంగా అందుబాటులో ఉన్న దాఖలాలు లేవు. ఐదేళ్ల క్రితం భవనం శిథిలావస్థకు చేరుకోవటంతో రూ.లక్షల్లో వ్యయంచేసి మరమ్మతులు చేయించారు. మరమ్మతులు చేయించారుగాని ఇప్పటి వరకు ఒక్క అధికారి కూడా అందుబాటులో ఉండటం లేదు. భవనాన్ని ఒక్క రోజుకూడా ఉద్యోగులు ఉపయోగించలేదు. కొంత కాలం వరకు నాల్గో తరగతి ఉద్యోగి ఉన్నారు. మండలంలో ఆర్అండ్‌బీ రోడ్లు వేసినప్పుడు మాత్రమే సేదతీరటానికి అప్పుడప్పుడు సిబ్బంది వచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అయితే తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆర్అండ్‌బీ భవనం ఉండటంతో రెవెన్యూ సిబ్బంది అవసరాలకు వినియోగించుకుంటాం భవనం తాళాలు ఇవ్వమని అధికారులను అడిగినప్పటికి ఆర్అండ్‌బీ అధికారుల నుంచి స్పందన లేదు. రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న మండలం కనుక సంబంధిత అధికారులు ఇక్కడి నుంచి పరిపాలన చేసి ప్రజాధనంలో నిర్మించిన భవనాలను సద్వినియోగం చేయాలని పలువురు కోరుతున్నారు.

పత్తి రైతును ముంచిన అధిక వర్షాలు

● ఎదుగుదల లేక పంటను పీకేస్తున్న రైతులు
● నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న వైనం
● అతివృష్టి, అనావృష్టితో అతలాకుతలం



వరగానిలో పత్తి పంటను పీకేస్తున్న రైతు



పుసులూరులో పత్తి చేనులో నిలిచిన వర్షపునీటితో వాడిపోయిన మొక్కలు

పెదనందిపాడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటుపోటుల మధ్యన వ్యవసాయం చేసే పత్తి రైతులు ప్రతి ఏటా కష్టాలు, కన్నీళ్లనే చవిచూస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి మధ్యన నలిగిపోతున్నారు. ఏదో ఒక రూపంలో అప్పుల ఊబిలో మునిగిపోతున్నారు. ఐదు సంవత్సరాలుగా పత్తిని గులాబీరంగు పురుగు ఆశించి పూర్తిగా నష్టం వాటిల్లింది. దీంతో పత్తిని సాగుచేసేందుకు వెనకడుగు వేశారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు గతేడాది పత్తి సాగుచేసిన రైతులకు దిగుబడి మద్దతు ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది ముందస్తుగానే పత్తిసాగు చేపట్టారు. అయితే గత రెండు నెలలుగా కురుస్తున్న అధిక వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయి. ఈ పరిస్థితిలో పంట పూర్తిగా ఎదుగుదల లేదు. దీనికి తోడు మందుల పిచికారీ చేసే సమయం లేకపోవడంతో పంటను పూర్తిగా చీడపీడలు ఆశించి పైరు రంగు మారి గిటకబారడంతో చేసేదేమీలేక రైతులు వాటిని పీకేసి ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మండలంలో సుమారుగా 1000ఎకరాలు పత్తి పంట సాగుచేశారు. కాలువల్లో నీరు పారుదల లేకపోవడం వల్లే పంట పొలాల్లో నీరు నిలిచి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు.



మంత్రి లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంచుతున్న ఆటోడ్రైవర్లు, కూటమి నేతలు

ఆటో డ్రైవర్ల సేవలో పథకంపై హర్షం

మంగళగిరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రారంభించి ఆటో సోదరుల ఖాతాల్లో రూ.15వేలు జమ చేయడంపై కూటమి నేతలు, డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. కొత్తపేట పరిధిలోని ఆటో డ్రైవర్లతో కలిసి ఆదివారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కూటమి ప్రభుత్వానికి ఆటోడ్రైవర్లు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మంగళగిరి రెండో వార్డు మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి నరేంద్ర (బాబీ), శివాలయం ట్రస్టుబోర్డు మెంబరు సుఖమంచి గిరిబాబు, నేతలు తాడిగిరి సుధీర్, కట్టా దుర్గాప్రసాద్, ఫణిదపు మల్లేశ్వరరావు, సైనాథం శ్రీనివాసరావు, పూజల శ్రీనివాసరావు, రంగిశెట్టి పెద్దబ్బాయి, మంగళగిరి శ్రీనివాసరావు, బండారు రమేశ్, కొనిశెట్టి దుర్గారావు, సజ్జా సాయికుమార్, రాఘవరపు గోపి తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్య ప్రాంతాలపై డ్రోన్ నిఘా



డ్రోన్ సాయంతో నిర్మానుష్య ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకట్

మంగళగిరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండల పరిధిలోని నిర్మానుష్య ప్రాంతాలపై డ్రోన్ కెమెరాల సాయంతో నిరంతర నిఘా ఉంచుతున్నట్టు ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. మంగళగిరి మండలం ఎర్రబాలెం ఇండస్ట్రియల్ ఏరియాను ఆదివారం డ్రోన్ సాయంతో విస్తృతంగా పరిశీలించారు. అనుమానిత ప్రాంతాలను నిశితంగా పరిశీలించామని, బహిరంగ మద్యపానం, గంజాయి సేవనం, జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పర్యవేక్షణ జరిపినట్టు ఎస్ఐ వెంకట్ చెప్పారు. బహిరంగ మద్యపానం చేస్తున్న పలువురిపై కేసులు నమోదు చేశామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సాంకేతికతను వినియోగించుకుంటూ నిరంతర నిఘా ఉంచుతున్నామని, ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు.



స్వర్గారోహణ మండపాన్ని ప్రారంభిస్తున్న సురక్ష ఆసుపత్రి అధినేత డాక్టర్ పోశం ప్రగతిరెడ్డి

స్వర్గారోహణ మండపం ప్రారంభం

ప్రత్తిపాడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులు కొంత మేరకు తీరాయి. దాతల చేయూతతో రూ.65.5 లక్షల వ్యయంతో నిర్మించిన స్వర్గారోహణం, శివైక్యం భవనాలను ఆదివారం ప్రారంభించారు. గ్రామ పెద్దలు, దాతల సమక్షంలో గుంటూరు సురక్ష హాస్పిటల్ అధినేత డాక్టర్ పోశం ప్రగతిరెడ్డి స్వర్గారోహణం భవనాన్ని ప్రారంభించగా, బాపతు సాంబశివారెడ్డి, రజనీ దంపతులు శివైక్యం భవనాలను ప్రారంభించారు. స్వర్గారోహణం పేరుతో దహన సంస్కారాల మండపాన్ని గుజ్జుల శ్రీనివాసరెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు గురుగూరి ప్రతిభ, పోశం ప్రగతి రెడ్డి రూ.9 లక్షల వ్యయంతో నిర్మించారు. శివైక్యం పేరుతో విశ్రాంతి భవనాన్ని ప్రత్తిపాడుకు చెందిన బాపతు సాంబశివారెడ్డి రూ.7.5 లక్షల వ్యయంతో నిర్మించగా, రూ.50వేల వ్యయంతో కాటికాపరి విగ్రహాన్ని ఉల్లంఘుల విజయ్ చేయించారు. మరికొందరు దాతలు అస్తికల లాకర్, మార్చురీ బాక్స్, స్టీల్ పాడెను అందించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

శ్మశాన వాటికకు వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి స్పందన సంస్థల డైరెక్టర్ గంగిరెడ్డి పద్మజారెడ్డి ముందుకొచ్చారు. రూ.8లక్షలతో నిర్మించే ఈ రోడ్డు నిర్మాణానికి పెద్దల సమక్షంలో శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. కార్యక్రమాలలో జీ చంద్రశేఖరరెడ్డి, డబ్బూరి ఏడుకొండలు, నూతలపాటి అమర్, కమ్మ శివప్రసాద్, మల్లం రామకృష్ణ, వి.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్థులు ఘనంగా దుశ్శాలువాలతో సత్కరించారు.

మెగా ఇంజనీరింగ్ సైట్ ఆఫీసులో చోరీ

● ఐరన్ పోయినట్టు ఇంజనీర్ ఫిర్యాదు

తుళ్లూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణ పనులు చేపట్టిన కంపెనీలలో ఒకటైన మెగా ఇంజనీరింగ్ సంస్థ సైట్ ఆఫీసులో చోరీ జరిగింది. వీఐటీ కళాశాల సమీపంలో ఉన్న ఆ సంస్థకు చెందిన సైట్ ఆఫీసులో శనివారం రాత్రి దొంగతనం జరిగినట్టు అక్కడ పనిచేసే ఇంజనీర్ నరేశ్ ఆదివారం తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిర్మాణానికి సంబంధించిన ఐరన్ చోరీకి గురైనట్టు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మురళీధర్ తెలిపారు.

ముగిసిన జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ ఎంపిక పోటీలు



విజేతలుగా నిలిచిన చిన్నారులతో పిచ్చిరెడ్డి, పల్లబోతుల శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి 37వ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు మంగళగిరిలోని ఎంటీఎంసీ స్కేటింగ్ రింక్‌లో జరిగాయి. విజేతలుగా నిలిచి ఎంపికైన చిన్నారులకు స్థానిక నేతలు, అసోసియేషన్ ప్రతినిధులు బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో మంగళగిరి పీఏసీఎస్ చైర్మన్ గాదె పిచ్చిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు నీలిమ, కార్యదర్శి పీ.శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.థామసయ్య చౌదరి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్, అమరావతి స్కేటింగ్ క్లబ్ అధ్యక్షుడు చుక్కా సాంబశివరావు, కార్యదర్శి కుక్కమళ్ల విక్రమ్‌బాబు, కోశాధికారి బి.గోపి, కుర్రా నరేశ్, జి.రవి పాల్గొన్నారు.



శ్రీశైలం దేవాలయ ట్రస్టు బోర్డు సభ్యుడిగా నియమితుడైన శంకరశెట్టి పిచ్చయ్యను అభినందిస్తున్న కాట్రగడ్డ మధు, తదితరులు

శ్రీశైలం ట్రస్టు బోర్డు సభ్యుడు శంకరశెట్టికి సత్కారం

తాడేపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయమైన శ్రీశైలం దేవాలయ ట్రస్టు బోర్డు సభ్యుడిగా నియమితులైన శంకరశెట్టి పిచ్చయ్యను నియోజకవర్గ టీడీపీ నేతలు సత్కరించారు. వడ్డేశ్వరం గ్రామ టీడీపీ సీనియర్ నేత కాట్రగడ్డ మధుసూదనరావు తదితరులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించి కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా పలువురు శంకరశెట్టికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వడ్డేశ్వరం గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, వెలగపూడి కిషోర్ బాబు, ఇప్పటం గ్రామ టీడీపీ అధ్యక్షుడు రత్తయ్య, నగేశ్, చావలి సురేశ్, షేక్ నాగూర్ వలి, షేక్ ఇమాంసా, మస్తాన్, వడ్డేశ్వరం ప్రసాద్, మస్తాన్‌వలి, నాగేశ్వరరావు, అప్పారావు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 8,216 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 8,216 క్యూసెక్కుల నీటిని ఆదివారం విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 1,82,175 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ చానల్‌కు 270 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 1,917 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 730 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 230 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 502 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 3,580 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కౌలు ఇప్పించండి సారూ..!

● రాజధాని మహిళా రైతు అగచాట్లు
● సీఆర్డీఏ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
● గన్నవరం విమానాశ్రయ రైతులకూ దక్కని కౌలు



అర్జీని చూపుతున్న రైతు మహిళ ధనసిరి రాజేశ్వరి

గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం తనకున్న అరెకరం భూమినిచ్చిన ఓ మహిళా రైతు కౌలు రాకపోవడంతో అగచాట్లు పడుతున్నారు. వెలగపూడి గ్రామానికి చెందిన ధనసిరి రాజేశ్వరి 2015లో కొడమరాజుపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న తన అరెకరం పొలాన్ని రాజధాని కోసం ఇచ్చారు. గతేడాది వరకు ఆమె కౌలు అందుకున్నారు. అయితే ఈ ఏడాది కౌలు జమ విషయంలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా ఆమెకు కౌలు చేతికి రాలేదు. తనతోటి రైతులందరికీ ఈ ఏడాది జూలైలోనే కౌలు అందింది. ఈ ఏడాది కౌలు కింద ఆమెకు సీఆర్డీఏ రూ.52వేలు ఇవ్వాల్సి ఉంది. ఆమె చిన్నకారు రైతు కావడంతో కౌలే ఆధారంగా ఉంది. దీంతో ఆమె కౌలు కోసం మూడు నెలలుగా కాళ్లరిగేలా సీఆర్డీఏ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రతి శుక్రవారం జరిగే గ్రీవెన్స్ కార్యక్రమంలో అర్జీలు పెట్టుకుంటున్నారు. అధికారులిచ్చే గ్రీవెన్స్ రసీదులు మారుతున్నాయి కానీ కౌలు మాత్రం ఆమెకు దక్కడం లేదు. కాగా, గన్నవరం విమానాశ్రయ విస్తరణ కోసం భూములిచ్చిన రైతులకు కూడా కౌలు పడలేదని వాపోతున్నారు. చాలామంది రైతులకు మూడేళ్లకు సంబంధించిన కౌలు బకాయి ఉన్నట్లు చెబుతున్నారు. సీఆర్డీఏ అధికారులను అడిగితే నిధులు రావాలని ఒకసారి, సీఎఫ్ఎంఎస్‌లో సమస్య ఉందని మరోసారి చెప్పి కాలం గడిపేస్తున్నారు తప్ప కౌలు మాత్రం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నర్రా మహాలక్ష్మి, వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

వైద్య శిబిరానికి విశేష స్పందన

● 350మందికి వైద్య పరీక్షలు

పెదనందిపాడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నర్రా సుబ్బరామయ్య జ్ఞాపకార్థం వారి కుమార్తె, కుమారుడు మాజీ ఎంపీపీలు నగరాజకుమారి, బాలకృష్ణ, రోటరీ క్లబ్ ఆఫ్ పెదనందిపాడు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పీఏఎస్ కళాశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కాటూరి మెడికల్ ఆసుపత్రి, కళాశాల వారి ఈ వైద్య శిబిరానికి సహకారం అందించారు. వైద్యశిబిరాన్ని సుబ్బరామయ్య సతీమణి నర్రా మహాలక్ష్మి ప్రారంభించారు. వైద్యులు డా.వంశీకృష్ణ, విజేంద్ర, వాసవీ 350మందికి జనరల్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొబైల్ వాహనంలో పరీక్షలు నిర్వహించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలిశెట్టి వీరరాఘవయ్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ, నర్రా సుబ్బరామ్య ఈ ప్రాంతంలో విద్యావ్యాప్తికి విశేష కృషిచేశారని, వారి ఆశయాలను ఆయన కుటుంబసభ్యులు కొనసాగిస్తూ పేదలకు చేయూతనందిస్తున్నారన్నారు. రోగులకు ఎన్‌సీసీ విద్యార్థులు సేవలందించారు. తొలుత సుబ్బరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి రైతన్న డెయిరీ వారు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, ఆళ్ల హరిప్రసాద్, రోటరీ లిటరసీ చైర్మన్ డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు కొల్లా సాంబశివరావు (నవత), పోపూరి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ జీ వీరరాఘవయ్య, కెప్టెన్ పాతూరి శ్రీనివాసరావు, మెడికల్ కళాశాల డీఎస్డీ రామకృష్ణ, మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అనంతవరం గో ప్రాంగణంలో ఉద్రిక్తత

● గోవులను అక్రమంగా విక్రయిస్తున్నారన్న గ్రామస్థులు

తుళ్లూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన తోట సురేశ్ గో ప్రాంగణం పేరుతో గోవులను అమ్ముకుంటున్నాడని అనంతవరం గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అతను గోవులను అక్రమంగా సంతకు తరలించి సొమ్ము చేసుకుంటున్నాడంటున్నారు. ఈ విషయమై గ్రామానికి చెందిన కొమ్మినేని నరేంద్ర అనే వ్యక్తిపై తోట సురేశ్ అతని భార్య దాడికి దిగటంతో ఉద్రిక్తత నెలకొంది. తుళ్లూరు సీఐ అంజయ్య ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలకు సర్ది చెప్పారు. గోవుల అదృశ్యంపై కేసులు నమోదయ్యాయని, దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. ఈ విషయంలో ఎటువంటి వివాదాలకు తావులేదన్నారు. దీంతో వివాదం సద్దుమణిగింది. సీఆర్డీఏ రెండెకరాల స్థలంలో గోశాలను నిర్వహిస్తున్న సురేశ్ గోవులకు మేత వేయకుండా వాటిని అందిన కాడికి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని పోలీసులను కోరుతున్నారు. కాగా, ఇప్పటి వరకు 300 గోవులను కాపాడి గోశాల నిర్వహిస్తున్నామని సురేశ్ చెబుతున్నాడు. అవసరమైతే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళతామని అంటున్నాడు.